RNI No: APTEL /25/A2860

సీమ వార్త సాయంకాలం

అనంతపురం | సంపుటి : 1 | సంచిక : 98 | పేజీలు : 4 | శనివారం 10 అక్టోబర్ 2026 | ఎడిటర్ : బీరే ఈశ్వరయ్య | వెల : 2/-

UPI
UNIFIED PAYMENTS INTERFACE

ఆఫ్రికా చెల్లింపుల వ్యవస్థలో యూపీఐ..

భారత్‌తో జింబాబ్వే చర్చలు

ఆఫ్రికా చెల్లింపుల వ్యవస్థను మార్చేందుకు జింబాబ్వే ప్రయత్నాలు

భారత యూపీఐ టెక్నాలజీ కోసం ఎన్‌పీసీఐతో చర్చలు




13న విజయవాడకు రానున్న తమిళనాడు సీఎం విజయ్

- సీఎం చంద్రబాబుతో కృష్ణా జలాల వాటాపై కీలక చర్చలు
- తెలుగు గంగ ఒప్పందం ప్రకారం నీరు రావడం లేదని తమిళనాడు ఆందోళన
- ఏపీ నిర్మించతలపెట్టిన డ్యామ్‌లపైనా చర్చించనున్న సీఎం విజయ్
- పర్యటనలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తోనూ భేటీ అయ్యే అవకాశం

స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు ఖరారు

- ఏపీ కేబినెట్ కీలక నిర్ణయం
- రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ సిఫార్సులకు కేబినెట్ ఆమోదం
- పలు పదవులకు 24 శాతం నుంచి 35 శాతం వరకు రిజర్వేషన్లు
- కూటమి పక్షాల ద్వారా 34 శాతతం సీట్లు బీసీలకు కేటాయిస్తామని హామీ



అమరావతి

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి బీసీ రిజర్వేషన్లపై చంద్రబాబు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. చంద్రబాబు అధ్యక్షతన ఈరోజు జరిగిన కేబినెట్ సమావేశంలో... రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ చేసిన సిఫార్సులకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. కేబినెట్ ఆమోదించిన వివరాల ప్రకారం... స్థానిక సంస్థల్లో వివిధ పదవులకు కొత్త బీసీ రిజర్వేషన్ల శాతాలను ఖరారు చేశారు. ఇందులో మేయర్లకు 35.29 శాతం, మున్సిపల్ ఛైర్‌పర్సన్లకు 33.02 శాతం, పట్టణ వార్డు సభ్యులకు 32.78 శాతం రిజర్వేషన్లు వర్తిస్తాయి. అలాగే, సర్పంచ్‌లకు 27.95 శాతం, ఎంపీటీసీలకు 25.55 శాతం, ఎంపీపీలు, జెడ్పీటీసీలకు 24.60 శాతం చొప్పున కోటా కేటాయించారు. జెడ్పీ ఛైర్‌పర్సన్లకు మాత్రం 23.08 శాతం రిజర్వేషన్లు అమలు చేయనున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు - మిగతా3లో

పార్టీ అభ్యర్థులకు లీగల్ సెల్ రక్షణ కవచంలా నిలవాలి

వైఎస్సార్‌సీపీ స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి

స్థానిక సంస్థల ఎన్నికలు అత్యంత కీలకమైన దశలోకి వెళ్తున్నాయి

పార్టీ లీగల్ సెల్ ఇక సాధారణ అనుబంధ విభాగంగా కాకుండా ఎన్నికల ప్రక్రియ మొత్తాన్ని న్యాయపరంగా పర్యవేక్షించే వ్యవస్థగా పనిచేయాలి



తాడేపల్లి

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు లీగల్ సెల్ రక్షణ కవచంలా, అవసరమైనప్పుడు న్యాయపరమైన ఆయుధంలా నిలవాలని వైఎస్సార్‌సీపీ స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన పార్టీ లీగల్ సెల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. - మిగతా3లో



తిరుమల శ్రీవారికి జైపూర్ దంపతుల ఖరీదైన కానుక..

- మరో దాత భారీ విరాళం
- శ్రీవారికి రూ. 51.55 లక్షల విలువైన ఆభరణాలు విరాళం
- జైపూర్ దంపతులు సమర్పించిన బంగారు లాకెట్, ముత్యాల హారం
- టీటీడీ బర్డ్ ట్రస్ట్‌కు రూ. 10 లక్షల భారీ విరాళం
- అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన దాత హర్షవర్ధన్ రెడ్డి

ఢిల్లీలో హై టెన్షన్..

- మమతా, కేజ్రీవాల్ సహా పలువురు మాజీ సీఎంల అరెస్ట్
- ఢిల్లీలో నిరసనల ఉద్రిక్తత.. మమతా, కేజ్రీవాల్ అరెస్ట్
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలంటూ విపక్షాల డిమాండ్
- అనుమతి లేదంటూ నేతలను అదుపులోకి తీసుకున్న ఢిల్లీ పోలీసులు
- కేరళ మాజీ సీఎం పినరయి విజయన్‌తో పాటు పలువురు ఎంపీల నిర్బంధం



దసరా ఎఫెక్ట్..

దసరా సెలవుల కారణంగా హైదరాబాద్-విజయవాడ

జాతీయ రహదారిపై వాహనాల రద్దీ



- హైదరాబాద్--విజయవాడ హైవేపై వెళ్లేవారికి బిగ్ అలర్ట్..
- ఈ రూట్‌లో జాగ్రత్త!
- విపరీతంగా పెరిగింది.
- ముఖ్యంగా చౌటుప్పల్ వద్ద కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ ఏర్పడి ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు
- సెలవులు, ఫ్లైఓవర్ నిర్మాణ పనులు దీనికి ప్రధాన కారణం
- ప్రయాణికులు అదనపు సమయాన్ని కేటాయించుకోవాలని

హైదరాబాద్

యాదాద్రి భువనగిరి జిల్లా: దసరా పండుగ సెలవుల నేపథ్యంలో హైదరాబాద్--విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ ఒక్కసారిగా పెరిగింది. చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో వాహనాలు భారీగా నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాఠశాలలు, కళాశాలలకు సెలవులు ప్రారంభం కానుండటంతో సొంతూళ్లకు వెళ్లేందుకు వాహనదారులు పెద్ద సంఖ్యలో రోడ్లపైకి రావడమే ఈ రద్దీకి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. దీంతో చౌటుప్పల్ పరిధిలో వాహనాలు కిలోమీటర్ల మేర నెమ్మదిగా కదులుతున్నాయి. సాధారణంగా హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్లే ప్రయాణికులు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటారు. పండుగ ప్రయాణాలు పెరగడంతో జాతీయ రహదారిపై ట్రాఫిక్ ఒత్తిడి అధికమైంది. కార్లు, ఇతర వాహనాలు పెద్ద సంఖ్యలో రోడ్డుపైకి రావడంతో ప్రయాణ వేగం - మిగతా3లో




బీఆర్ఎస్ తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మలేదు

- గత ఏడాదితో పోలిస్తే రిజిస్ట్రేషన్ల ఆదాయం 21 శాతానికి పైగా పెరిగిందన్న పొంగులేటి
- ఇదే రేవంత్ రెడ్డి సమర్థ పాలనకు నిదర్శనమని వ్యాఖ్య
- పదేళ్ల బీఆర్ఎస్ పాలనలోని భూ అక్రమాలను వెలికితీస్తున్నామని వెల్లడి

హైదరాబాద్ హైస్పీడ్ రైల్

- భూసేకరణకు రాష్ట్రాలకు ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదని వెల్లడి
- ప్రస్తుతం జరుగుతున్న భూసేకరణ చట్టవిరుద్ధమని స్పష్టీకరణ
- కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో కిషన్ రెడ్డి భేటీ అనంతరం ప్రకటన
- ప్రస్తుతం కేవలం అలైన్‌మెంట్ అధ్యయనాలు మాత్రమే జరుగుతున్నాయని వెల్లడి



హైదరాబాద్

హైదరాబాద్ కేంద్రంగా నిర్మించ తలపెట్టిన మూడు హైస్పీడ్ రైల్ కారిడార్ల విషయంలో కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. ఈ ప్రాజెక్టులకు సంబంధించి ప్రస్తుతం అలైన్‌మెంట్ అధ్యయనాలు మాత్రమే జరుగుతున్నాయని, భూసేకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వాలకు ఎటువంటి ప్రతిపాదనలు పంపలేదని స్పష్టం చేసింది. ఈ దశలో హైస్పీడ్ రైల్ పేరుతో - మిగతా3లో

సీమ వార్త సాయంకాలం

శనివారం 10 అక్టోబర్ 2026

అనంతపురం జిల్లా/ సత్యసాయి (పుట్టపర్తి) జిల్లా

సురక్షిత రోడ్ల కోసం... ఢిల్లీ నేతలతో పయ్యావుల..!!

.....ఎన్.హెచ్-42 రహదారిని నాలుగు లైన్ల రహదారిగా విస్తరించాలి

.....కేంద్ర రోడ్డు, రవాణా మరియు రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కోరిన.....రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రివర్యులు పయ్యావుల కేశవ్.

కేంద్రమంత్రికి లేఖ అందించిన మంత్రివర్యులు పయ్యావుల కేశవ్.. సూత్రప్రాయంగా అంగీకారం తెలిపిన కేంద్ర మంత్రి.

అనంతపురం - బళ్ళారి రోడ్డు నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణానికి పయ్యావుల చర్యలు.



"అలిమినేని" చక్రాలతో... "అలుపు" లేని ప్రయాణం!!

....పల్లెల్లో ఎక్కడ చూసినా... అలిమినేని సైకిళ్లే సైకిళ్లు..!!

....విద్యార్థుల పాలిట అలిమినేని దేవుడయ్యాడు

.... విద్యార్థుల చేతికి "పచ్చ"ని విద్యా చక్రాలు

.... తన మనోభావాన్ని వ్యక్తం చేసిన కళ్యాణదుర్గం ప్రాంత... మల్లిపల్లి నారాయణ.

కళ్యాణదుర్గం అక్టోబర్ 10 సీమ వార్త సాయంత్రం.

నియోజకవర్గం వ్యాప్తంగా ఇప్పుడు ఎక్కడ చూసినా సైకిళ్ల సందడే. స్కూల్ కి వెళ్లే పిల్లల మొహాల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. దీనికి కారణం కళ్యాణదుర్గం ఎమ్మెల్యే గారి గొప్ప మానవతా నిర్ణయమే. స్కూల్ పిల్లలు రోజూ 3 కిలోమీటర్లు, 5 కిలోమీటర్లు కాలినడకన నడుస్తూ, ఎండలో అలసిపోతూ, సమయానికి స్కూల్ కి చేరలేక ఇబ్బంది పడుతున్నారని గుర్తించిన ఎమ్మెల్యే గారు, వారి యోగక్షేమాలు, భద్రతను దృష్టిలో ఉంచుకుని నియోజకవర్గం వ్యాప్తంగా ప్రేమతో ఉచిత సైకిల్ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు మా ఎమ్మెల్యే సార్ అని ఆనందం వ్యక్తం చేస్తున్నారు కళ్యాణ్ దుర్గం ప్రాంతానికి చెందిన మల్లి పల్లి నారాయణ- ఆడపిల్లలు వారి తల్లితండ్రులు చాలా సంతోషపడుతున్నారు.హరిజన ,గిరిజన, బడుగు, బలహీన ,ముస్లిం మైనార్టీ, క్రిస్టియన్ వర్గాల విద్యార్థిని విద్యార్థులు ప్రభుత్వ స్కూల్ కి అందరూ వెళ్ళాలి అన్నదే ఎమ్మెల్యే సార్ కోరిక అందుకే స్వయంగా వెళ్లి సైకిళ్ళు పంపిణీ చేయడం జరిగినది. ఇలాంటి వాళ్ళకి సైకిళ్ళు ఇస్తే విద్యార్థిని విద్యార్థుల్లో చదువుపై శ్రద్ధ పెరుగుతుందని డ్రాప్ అవుట్ తగ్గుతుందని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నమ్మకం, ఆ నమ్మకమే మన ఎమ్మెల్యే సురేంద్రబాబు గారి నమ్మకం అని అభిప్రాయపడుతున్నారు. "మా పిల్లలు ఇప్పుడు 10 నిమిషాల్లో స్కూల్ కి వెళ్తున్నారు. ఎమ్మెల్యే సురేంద్రబాబు సార్ గారు మా పిల్లలకు బంగారు భవిష్యత్తుకు బాటలు వేశారు అని తల్లిదండ్రులు ఆనందంగా, వారి సంతోషాన్ని బహిరంగంగా మాట్లాడుతున్నారు.పల్లెలో పట్టణంలో ప్రతి వీధిలో పిల్లలు సైకిళ్లపై స్కూల్ కి వెళ్తుంటే, కళ్యాణదుర్గం నియోజకవర్గం ఒకప్పుడు విద్యలో వెనుకబడిందనే మాటను పటాపంచలు చేస్తూ, విద్యా ప్రగతికి చిహ్నంగా మారింది. ఇలాంటి మంచి మనసున్న నాయకుడు మాకు ఎమ్మెల్యేగా ఉండడం మా అందరి అదృష్టం అని ప్రజలు, ఉపాధ్యాయులు, విద్యార్థి విద్యార్థినులు, విద్యార్థి సంఘాలు వారియొక్క గొప్పతనాన్ని కొనియాడుతున్నారు.







అనంతలో... ఉద్యోగస్తుల క్రికెట్ టోర్నమెంట్..!!

.....అక్టోబర్ 17న ప్రారంభం....ఐపీఎల్ తరహాలో కలర్ డ్రెస్సులతో క్రికెట్ టోర్నీ

.....శ్రీ ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ఎంప్లాయిస్ క్రికెట్ లీగ్ ప్రారంభం

....టోర్నమెంట్లో మొత్తం 30 ఉద్యోగస్తుల క్రికెట్ జట్లు

.....మచ్చా రామలింగారెడ్డి అధ్యక్షులు ఏపీ వెటర్నన్స్ క్రికెట్ అసోసియేషన్.

అనంతపురం అక్టోబర్ 10 సీమ వార్త సాయంత్రం.

అనంతపురం జిల్లా లో రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ స్థాపించి జిల్లా ప్రజలకు విద్య వైద్య క్రీడారంగంలో విశేష సేవలు అందించిన శ్రీ విన్సెంట్ ఫెర్రర్ జ్ఞాపకార్థం అనంతపురం నగరంలోని ఆర్డిటి క్రీడా మైదానం నందుఏపీ వెటర్నన్స్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫాదర్ ఫెర్రర్ ఉద్యోగస్తుల క్రికెట్ టోర్నమెంట్ అనంతపురం నగరంలోని ఆర్డిటి మైదానం నందు అక్టోబర్ 17వస ఉమ్మడి అనంతపురం జిల్లా ఉద్యోగస్తుల క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించడం జరుగుతుందని మచ్చా రామలింగారెడ్డి అధ్యక్షులు వెటర్నన్స్ క్రికెట్ అసోసియేషన్ తెలిపారు. ఈ ఏడాది నిర్వహించడం ద్వారా జిల్లాలో 25వ సంవత్సరం సిల్వర్ జూబ్లీ టోర్నమెంట్ గా ఉద్యోగస్తులు పోటీలు నిర్వహించడం జరుగుతున్నదని విన్సెంట్ ఫెర్రర్ పేరుమీద 25 సంవత్సరాలుగా ఉద్యోగుల క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం జరుగుతున్నదని మచ్చ రామలింగారెడ్డి అన్నారు అనంతపురంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మచ్చా రామలింగారెడ్డి తోఆర్గనైజింగ్ సెక్రటరీ కే విజయరాజు సభ్యుల వెంకట్ తదితరులు పాల్గొన్నారు ఐపీఎల్ తరహాలో ఉద్యోగస్తులకు ఎంప్లాయిస్ ప్రీమియర్ లీగ్ అనంతపురం పేరుతో ఈ టోర్నమెంట్ నిర్వహించడం జరుగుతుందని, మచ్చ రామలింగారెడ్డి తెలిపారు.ఉద్యోగస్తుల క్రికెట్ టోర్నమెంట్లో ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా మొత్తం 30 డిపార్ట్మెంట్లు ఉద్యోగస్తులు క్రికెట్ పట్ల ఆసక్తితో ఈ టోర్నమెంట్ లో పాల్గొంటున్నారని కేవలం సెలవు దినాల్లో మాత్రమే ఈ టోర్నమెంట్ నిర్వహించడం జరుగుతుందని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగస్తులందరూ ఈ టోర్నమెంట్ లో పాల్గొనడం అభినందనీయమని మచ్చ రామలింగారెడ్డి అన్నారు మొదటి మ్యాచ్ ఈనెల 17వ తారీఖున ప్రారంభిస్తామని 18వ తారీఖున కూడా పోటీలు ఆర్డిటి స్టేడియం నందు జరుగుతాయని మచ్చ రామలింగారెడ్డి వివరించారుఉమ్మడి అనంతపురం జిల్లాలోని 14 నియోజకవర్గాలలో గల రాష్ట్ర కేంద్ర ప్రభుత్వ ఉద్యోగస్తులు ఈ టోర్నమెంట్లో పాల్గొనవచ్చు. పాల్గొనే ఉద్యోగస్తులకు కలర్ టీ షర్ట్ లు అందజేయడం జరుగుతుందని,మచ్చ రామలింగారెడ్డి తెలిపారు.



"పంకా " వీడి..... సైకిల్ ఎక్కిన కదిరి ముస్లింలు..!!

.....కదిరి 23వ వార్డులో వైసీపీని వీడి టీడీపీలో చేరిన 30 ముస్లిం మైనార్టీ కుటుంబాలు

....అన్ని వర్గాల ప్రజలకు టీడీపీ అండగా ఉంటుంది

.....-- ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

కదిరి, అక్టోబర్ 10: సీమ వార్త సాయంత్రం.

కదిరి పట్టణంలో తెలుగుదేశం పార్టీతో కలిసి పనిచేసేందుకు అన్ని వర్గాల ప్రజలు ముందుకు వస్తున్నారని, ప్రజల సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ అన్నారు.కదిరి పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో 23వ వార్డుకు చెందిన 30 ముస్లిం మైనార్టీ కుటుంబాలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని వీడి, ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరాయి. కటిక షేక్ హస్సూ ఆధ్వర్యంలో ఆయన కుమారుడు సోహైల్‌తో పాటు మిచ్చెర్ సాదిక్, బాబ్జాన్, షేక్ మహమ్మద్ అలీ, మహాభాష, షేక్ బాబ్జాన్, రిక్షా సాదిక్ అలీ, అబిద్, వసీం, సాబు తదితరులు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై తెలుగుదేశం పార్టీలో చేరినట్లు తెలిపారు. ముస్లిం మైనార్టీల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను స్వాగతిస్తూ, పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మాట్లాడుతూ"తెలుగుదేశం పార్టీలోకి వచ్చే ప్రతి ఒక్కరినీ సాదరంగా ఆహ్వానిస్తున్నాం. ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత గౌరవం, గుర్తింపు కల్పిస్తాం. పాత, కొత్త నాయకులు, కార్యకర్తలు అనే తేడా లేకుండా అందరూ కలిసికట్టుగా పనిచేయాలి. కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరికీ పార్టీలో తగిన ప్రాధాన్యత ఉంటుంది. కదిరి నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సంక్షేమమే మా ప్రధాన లక్ష్యం" అని అన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సీమ వార్త సాయంకాలం

శనివారం 10 అక్టోబర్ 2026

ఆఫ్రికా చెల్లింపుల వ్యవస్థలో యూపీఐ..

భారత్ అభివృద్ధి చేసిన యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) సాంకేతికత అంతర్జాతీయ స్థాయిలో విశేష ఆదరణ పొందుతోంది. తాజాగా ఆఫ్రికా దేశమైన జింబాబ్వే తమ దేశ చెల్లింపుల వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేసేందుకు యూపీఐ సాంకేతికతను వినియోగించుకోవడంపై భారత్‌తో చర్చలు జరుపుతోంది. ఈ మేరకు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) అంతర్జాతీయ విభాగమైన ఎన్‌పీసీఐ ఇంటర్నేషనల్ పేమెంట్స్ లిమిటెడ్ (ఎన్ఐపీఎల్)తో జింబాబ్వే సంప్రదింపులు జరుపుతున్నట్లు ఒక నివేదిక వెల్లడించింది. ఈ ఒప్పందం కార్యరూపం దాల్చితే, జింబాబ్వేలోని బ్యాంకులు, మొబైల్ మనీ ఆపరేటర్లు, ఫిన్‌టెక్ సంస్థలు ఒకే వేదికపైకి వచ్చి రియల్ టైమ్ చెల్లింపులు జరిపేందుకు వీలు కలుగుతుంది. దీనివల్ల లావాదేవీల వ్యయం గణనీయంగా తగ్గడమే కాకుండా, నగదు బదిలీల వేగం కూడా పెరుగుతుందని జింబాబ్వే రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ జాన్ ముషయవాన్హు ఆశాభావం వ్యక్తం చేశారు. చిన్న మొత్తాల దేశీయ లావాదేవీలకు డెబిట్, క్రెడిట్ కార్డులకు ప్రత్యామ్నాయంగా ఇది నిలుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఎన్ఐపీఎల్‌తో సాగుతున్న ఈ చర్చలు ఈ ఏడాది అక్టోబర్ 31 నాటికి ఒక కొలిక్కి వచ్చే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం జింబాబ్వేలో డిజిటల్ లావాదేవీల సంఖ్య గణనీయంగానే ఉంది. 2025 నాలుగో త్రైమాసికంలో దేశవ్యాప్తంగా 238 మిలియన్ల ఎలక్ట్రానిక్ లావాదేవీలు నమోదు కాగా, వాటిలో 87 శాతం మొబైల్ మనీ ద్వారానే జరిగాయి. అయినప్పటికీ, ఈ లావాదేవీలకయ్యే ఖర్చు అధికంగా ఉంటోంది. ముఖ్యంగా విదేశాల నుంచి పంపే నిధులపై భారీగా ఛార్జీలు వసూలు చేస్తున్నారు. ప్రపంచ బ్యాంకు అంచనాల ప్రకారం, 2025లో ఆఫ్రికా దేశాలకు 200 డాలర్లు పంపడానికి సగటున 8 శాతం ఖర్చు అవుతుండగా, ప్రపంచ సగటు 6.5 శాతంగా ఉంది. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల ప్రకారం ఈ వ్యయం 3 శాతానికి మించకూడదు. యూపీఐ వంటి వ్యవస్థ అందుబాటులోకి వస్తే ఈ ఖర్చులు తగ్గి, మధ్యవర్తుల దోపిడీకి అడ్డుకట్ట పడనుంది. భారత యూపీఐ టెక్నాలజీ 2025 నాటికి ప్రపంచంలోని మొత్తం రియల్ టైమ్ లావాదేవీలలో 49 శాతం వాటాను కలిగి ఉండటం దాని సామర్థ్యానికి నిదర్శనం. జింబాబ్వేతో పాటు ఘనా, ఉగాండా, రువాండా, మొజాంబిక్ వంటి ఇతర ఆఫ్రికా దేశాలు కూడా యూపీఐ టెక్నాలజీపై ఆసక్తి కనబరుస్తున్నాయి. ఈ దేశాలు యూపీఐని స్వీకరిస్తే, మిగతా ఆఫ్రికా దేశాలకు ఇవే ప్రమాణాలుగా మారే అవకాశం ఉంది.

ఢిల్లీలో హై టెన్షన్..

రాజధాని ఢిల్లీలో నేడు తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరసనల్లో పాల్గొన్న పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారితో పాటు తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలు, కేరళ మాజీ సీఎం పినరయి విజయన్ సహా పలువురు విపక్ష నేతలను కూడా నిర్బంధించి డిటెన్షన్ సెంటర్‌కు తరలించారు. ఎన్నికల కమిషన్, ఎన్నికల ప్రక్రియలకు సంబంధించిన ఆరోపణలపై విపక్షాలు తలపెట్టిన ఆందోళనల్లో పాల్గొనేందుకు మమతా బెనర్జీ ఢిల్లీకి వచ్చారు. సెంట్రల్ ఢిల్లీలోని సౌత్ అవెన్యూ సమీపంలో పోలీసులు ఆమెను అడ్డుకోవడంతో, సమీపంలోని బస్టాండ్‌లో బైఠాయించి నిరసన తెలిపారు. దీంతో పోలీసులు ఆమెను, టీఎంసీ ఎంపీలు డెరెక్ ఓబ్రెయిన్, డోలా సేన్‌లను అదుపులోకి తీసుకున్నారు.
మరోవైపు ఇదే నిరసనలో పాల్గొనేందుకు తన నివాసం నుంచి బయటకు వస్తున్న అరవింద్ కేజ్రీవాల్‌ను పోలీసులు మార్గమధ్యంలోనే నిర్బంధించారు. కేరళ మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్, సీపీఎం ఎంపీ జాన్ బ్రిట్టాస్ వంటి ఇతర నేతలను కూడా అరెస్ట్ చేశారు. జంతర్ మంతర్ వద్ద సీజేపీ ఈ నిరసనకు పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీసులు ఢిల్లీ వ్యాప్తంగా భద్రతను కట్టుదిట్టం చేశారు. ఢిల్లీకి చేరుకున్న సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ డిప్కేను కూడా పోలీసులు నిర్బంధించారు. నగరంలో నిరసనలకు ఆంక్షలు అమలులో ఉన్నాయని, ఆందోళనకు ముందస్తు అనుమతి లేనందునే నేతలను అదుపులోకి తీసుకున్నట్టు ఢిల్లీ పోలీసులు తెలిపారు. ఓటర్ల జాబితా సవరణలతో పాటు ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతపై విపక్షాలు కొంతకాలంగా ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ క్రమంలోనే ఎన్నికల కమిషన్ జవాబుదారీగా ఉండాలని డిమాండ్ చేస్తూ నిరసన చేపట్టాయి. ఈ అరెస్టుల నేపథ్యంలో భవిష్యత్తులో తమ ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని విపక్ష నేతలు సూచిస్తున్నారు.

హైదరాబాద్ హైస్పీడ్ రైల్..

-మొదటిపేజీ తరువాయి

ఎవరైనా భూసేకరణకు పాల్పడితే అది చట్టవిరుద్ధం అవుతుందని స్పష్టం చేసింది. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి శనివారం ఢిల్లీలో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో సమావేశమయ్యారు. ఈ భేటీలో హైదరాబాద్-చెన్నై, హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్-పుణె హైస్పీడ్ రైల్ కారిడార్ల పురోగతిపై చర్చించారు. సమావేశం అనంతరం ఈ వివరాలను కిషన్ రెడ్డి 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా పంచుకున్నారు. "రైల్వే మంత్రి స్పష్టం చేసిన దాని ప్రకారం.. సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలకు ఎటువంటి భూసేకరణ అభ్యర్థనలు పంపలేదు. ఈ దశలో హైస్పీడ్ రైల్ పేరుతో జరుగుతున్న ఏ భూసేకరణ అయినా చట్టవిరుద్ధం" అని కిషన్ రెడ్డి తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ప్రాజెక్టుల అలైన్‌మెంట్ ఖరారైన తర్వాతే ఆ వివరాలను రాష్ట్ర ప్రభుత్వాలతో, రైతులతో పంచుకోవడం జరుగుతుందని మంత్రి హామీ ఇచ్చారని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో రైల్ కారిడార్లతో పాటు ఇతర ప్రాజెక్టుల కోసం భూసేకరణ ప్రయత్నాలు చేస్తున్నట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో కేంద్రం చేసిన ఈ ప్రకటన ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రభుత్వ భూసేకరణ ప్రయత్నాలను కొందరు రైతులు వ్యతిరేకిస్తున్న తరుణంలో ఈ స్పష్టత రావడం గమనార్హం. మరోవైపు కిషన్ రెడ్డితో జరిగిన సమావేశంపై దక్షిణ మధ్య రైల్వే కూడా స్పందించింది. హైదరాబాద్‌ను మూడు ప్రధాన నగరాలతో అనుసంధానించే హైస్పీడ్ రైల్ కనెక్టివిటీకి సంబంధించిన ప్రతిపాదిత అలైన్‌మెంట్‌పై ఇరువురు మంత్రుల మధ్య ఉన్నత స్థాయి చర్చలు జరిగాయని సోషల్ మీడియాలో పేర్కొంది. ఇదిలా ఉండగా, భారతీయ రైల్వేలు 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను జూలై వరకు బడ్జెట్ కేటాయింపుల్లో రూ. 1.14 లక్షల కోట్లకు పైగా మూలధన వ్యయం చేసినట్లు ప్రభుత్వం గతంలో వెల్లడించింది. అలాగే, దేశీయ పరిజ్ఞానంతో రూపొందించిన 'కవచ్' ఆటోమేటిక్ ట్రైన్ ప్రొటెక్షన్ (ఏటీపీ) వ్యవస్థను 2,633 రూట్ కిలోమీటర్ల మేర ఏర్పాటు చేసినట్లు రైల్వే మంత్రి లోక్‌సభలో తెలిపారు.

బీఆర్ఎస్ తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మలేదు

తెలంగాణలో భూముల విషయంలో బీఆర్ఎస్ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ప్రజలు తిరస్కరించారని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమర్థ పాలనపై విశ్వాసం ఉంచారని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో భూములు, ఆస్తుల రిజిస్ట్రేషన్లు గణనీయంగా పెరగడమే ఇందుకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు.
ఈ అంశంపై ఆయన 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా స్పందించారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి ఆగస్టు మధ్య కాలంలో వ్యవసాయ, వ్యవసాయేతర ఆస్తుల రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వ ఆదాయం భారీగా పెరిగిందని వివరించారు. గత ఏడాదితో పోలిస్తే స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయం 21.86 శాతం వృద్ధి చెందిందని తెలిపారు. ఈ గణాంకాలే ప్రభుత్వ పనితీరుకు, సీఎం రేవంత్ రెడ్డి పాలనా సామర్థ్యానికి నిదర్శనమని స్పష్టం చేశారు. రాజకీయ లబ్ధి కోసం భూములపై బీఆర్ఎస్ చేసిన అసత్య ప్రచారాలను, ఆరోపణలను ప్రజలు నమ్మలేదని పొంగులేటి అన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో జరిగిన భూ అక్రమాలను తమ ప్రభుత్వం వెలికితీస్తోందని తెలిపారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారాలు చూపుతూ, ప్రజలకు వివాదరహిత భూములను అందించేందుకు కృషి చేస్తున్నామని ఆయన వివరించారు.

స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు ఖరారు..

-మొదటిపేజీ తరువాయి

కల్పించాలన్న ప్రభుత్వ ప్రతిపాదనను సుప్రీంకోర్టు తిరస్కరించిన నేపథ్యంలో ఈ నిర్ణయం ప్రాధాన్యత సంతరించుకుంది. కోర్టు తీర్పును గౌరవిస్తూ, నిబంధనలకు అనుగుణంగా బీసీలకు లబ్ధి చేకూర్చేలా ఈ రిజర్వేషన్లను ఖరారు చేసినట్లు మంత్రులు తెలిపారు. గత ప్రభుత్వం అమలు చేసిన రిజర్వేషన్ల కన్నా ఇవి మెరుగ్గా ఉన్నాయని వారు పేర్కొన్నారు. చట్టపరంగా రిజర్వేషన్లు అందిస్తూనే, కూటమి పక్షాల మధ్య సీట్ల పంపకాల ద్వారా మొత్తం మీద 34 శాతం ప్రయోజనం బీసీలకు దక్కేలా చూస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది.

13న విజయవాడకు రానున్న తమిళనాడు సీఎం విజయ్..

ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల మధ్య నెలకొన్న జల వివాదాల పరిష్కారం దిశగా కీలక ముందడుగు పడనుంది. తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ ఈ నెల 13న విజయవాడలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఆయన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో సమావేశమై పలు కీలక అంశాలపై చర్చించనున్నారు. ప్రధానంగా తెలుగు గంగ ప్రాజెక్టు కింద కృష్ణా జలాల సరఫరాలో ఏర్పడిన లోటు, ఏపీ ప్రభుత్వం నిర్మించతలపెట్టిన డ్యామ్‌లు, నదుల అనుసంధానం వంటి అంశాలు ఈ భేటీలో ప్రస్తావనకు రానున్నాయి.
తెలుగు గంగ ఒప్పందం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ ఏటా 12 టీఎంసీల కృష్ణా జలాలను తమిళనాడుకు రాష్ట్ర సరిహద్దు వద్ద అందించాల్సి ఉంది. అయితే, ఈ ఏడాది అక్టోబర్ 9 నాటికి కేవలం 2.251 టీఎంసీల నీరు మాత్రమే అందింది. ఒప్పందం ప్రకారం రావాల్సిన నీటికి, ఇప్పటివరకు అందిన నీటికి మధ్య 9.749 టీఎంసీల భారీ వ్యత్యాసం ఉంది. ఈ నీటి కొరత అంశమే ఇద్దరు ముఖ్యమంత్రుల భేటీలో ప్రధాన చర్చనీయాంశంగా మారనుంది. ఈ ఏడాదిలో మిగిలిన కాలానికి తమిళనాడు నీటి అవసరాలను సమీక్షించి, సరఫరాను గాడిన పెట్టేందుకు ఈ సమావేశం ఒక అవకాశంగా నిలవనుంది. కృష్ణా జలాల వాటాతో పాటు తమిళనాడులోకి ప్రవహించే నదులపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం డ్యామ్‌లు నిర్మించేందుకు చేస్తున్న కసరత్తుపై కూడా సీఎం విజయ్ తన ఆందోళనలను చంద్రబాబు దృష్టికి తీసుకురానున్నారు. ఈ డ్యామ్‌ల నిర్మాణం వల్ల దిగువ రాష్ట్రమైన తమకు నీటి లభ్యతపై తీవ్ర ప్రభావం పడుతుందని తమిళనాడు భావిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రతిపాదిత డ్యామ్‌ల అంశం కూడా చర్చల ఎజెండాలో కీలకంగా ఉండనుంది. దీంతో పాటు నదుల అనుసంధానంపై కూడా ఇరు రాష్ట్రాల మధ్య సంప్రదింపులు జరిగే అవకాశం ఉంది. ఈ పర్యటనలో భాగంగా సీఎం విజయ్, ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో పాటు ఇతర మంత్రులతో కూడా సమావేశం కానున్నారని సమాచారం. ఇరు రాష్ట్రాల రాజకీయ నాయకత్వాల మధ్య ప్రత్యక్ష చర్చల ద్వారా దీర్ఘకాలంగా ఉన్న నీటి సమస్యలకు ఒక పరిష్కారం కనుగొనాలని తమిళనాడు ప్రభుత్వం భావిస్తోంది. ఈ ఉన్నతస్థాయి సమావేశం తర్వాత వెలువడే నిర్ణయాలు రెండు రాష్ట్రాల మధ్య జల సంబంధాలపై స్పష్టతనిస్తాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

పార్టీ అభ్యర్థులకు లీగల్ సెల్ రక్షణ కవచంలా నిలవాలి

-మొదటిపేజీ తరువాయి

సమావేశంలో వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శులు పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, లేళ్ల అప్పిరెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, పూడి శ్రీహరి, లీగల్ సెల్ స్టేట్ ప్రెసిడెంట్ మలసాని మనోహర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ సుదర్శన్‌రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా అధ్యక్షులు, అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ, స్థానిక సంస్థల ఎన్నికలు అత్యంత కీలకమైన దశలోకి వెళ్తున్నాయని, పార్టీ లీగల్ సెల్ ఇక సాధారణ అనుబంధ విభాగంగా కాకుండా ఎన్నికల ప్రక్రియ మొత్తాన్ని న్యాయపరంగా పర్యవేక్షించే వ్యవస్థగా పనిచేయాలని అన్నారు.
రాష్ట్రంలో చట్టాలు, నిబంధనలు, ఎన్నికల వ్యవస్థలు ఉన్నప్పటికీ అవి సక్రమంగా అమలవడం లేదని ఆయన అన్నారు. 2024 ఎన్నికల తర్వాత వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై తప్పుడు కేసులు, దాడులు, వేధింపులు జరిగాయని, అలాంటి పరిస్థితుల్లో లీగల్ సెల్ కార్యకర్తలకు అండగా నిలిచిందని అభినందించారు.

ఎస్ఐఆర్ పూర్తయ్యేలోపే ఎన్నికలకు ఎందుకు తొందర?

ఎస్ఐఆర్ ప్రక్రియలో పెద్ద సంఖ్యలో చనిపోయినవారి, డూప్లికేట్, అనర్హ ఓట్లు తొలగిస్తున్న పరిస్థితుల్లో, కొత్త ఓటర్ల జాబితా అందుబాటులోకి రాకముందే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లేందుకు ప్రభుత్వం తొందరపడుతోందని సజ్జల అన్నారు. ఎస్ఐఆర్ ఫైనల్ జాబితా త్వరలోనే రావాల్సి ఉన్నప్పుడు, దానికి ముందే నోటిఫికేషన్ ఇవ్వాలనే ప్రయత్నం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆయన అభిప్రాయపడ్డారు. కొత్తగా ఓటు హక్కు పొందినవారిని జాబితాలో చేర్చకుండా ఎన్నికలు నిర్వహిస్తే వారి రాజ్యాంగబద్ధ హక్కు దెబ్బతింటుందని అన్నారు.

బీసీ రిజర్వేషన్లపై స్పష్టత ఇవ్వాలి

బీసీ రిజర్వేషన్ల విషయంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిషన్ నివేదికను ప్రజలకు అందుబాటులో పెట్టకుండా శాతం నిర్ణయించడం ఏ ప్రాతిపదికన జరిగిందో వెల్లడించాలని సజ్జల డిమాండ్ చేశారు. కమిషన్ నివేదికను పబ్లిక్ డొమైన్‌లో పెట్టి, ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలకు ఆధారాలు వెల్లడించాలని అన్నారు.

నామినేషన్ దశ నుంచే అప్రమత్తంగా ఉండాలి

స్థానిక సంస్థల ఎన్నికల్లో అసలు పోరాటం నామినేషన్ దశ నుంచే ప్రారంభమవుతుందని సజ్జల అన్నారు. కుల ధ్రువీకరణ పత్రాలు, ఎన్‌ఓసీలు, ఇతర అవసరమైన సర్టిఫికెట్లు ఇవ్వకుండా అభ్యర్థులకు ఇబ్బందులు సృష్టించే అవకాశం ఉందని, అందువల్ల ముందుగానే అన్ని డాక్యుమెంట్లు సిద్ధం చేయించాలని సూచించారు. రిజర్వేషన్లు ప్రకటించిన తర్వాత నామినేషన్లకు చాలా తక్కువ సమయం ఉండే అవకాశం ఉన్నందున, అభ్యర్థులు, ప్రత్యామ్నాయ అభ్యర్థులు, అవసరమైన లీగల్ టీమ్‌లను ఇప్పటి నుంచే సిద్ధం చేయాలని చెప్పారు.

గ్రామం నుంచి రాష్ట్ర స్థాయి వరకు లీగల్ నెట్‌వర్క్

ప్రతి గ్రామం, మండలం, నియోజకవర్గం, జిల్లా స్థాయిలో అందుబాటులో ఉండే న్యాయవాదులను మ్యాపింగ్ చేసి, వారి కాంటాక్ట్ వివరాలను కంప్యూటరైజ్ చేయాలని సజ్జల సూచించారు. గ్రామ స్థాయి అభ్యర్థికి కూడా తనకు అవసరమైనప్పుడు ఏ న్యాయవాదిని సంప్రదించాలో ముందుగానే తెలిసేలా వ్యవస్థ ఉండాలన్నారు. జిల్లా స్థాయిలో లీగల్ వార్‌రూమ్, నియోజకవర్గ స్థాయిలో టాస్క్‌ఫోర్స్ టీమ్‌లు, రాష్ట్ర కేంద్ర కార్యాలయంలో ప్రత్యేక సమన్వయ వ్యవస్థ ఏర్పాటు చేయాలని సూచించారు. ఎక్కడైనా సమస్య తలెత్తితే వెంటనే జిల్లా నుంచి రాష్ట్ర కార్యాలయానికి సమాచారం చేరి, అవసరమైతే స్టేట్ ఎలక్షన్ కమిషన్, కోర్టులను ఆశ్రయించేలా వ్యవస్థ పనిచేయాలని చెప్పారు. సెన్సిటివ్ ప్రాంతాలు, నామినేషన్ కేంద్రాలు, పోలింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌లను ముందుగానే గుర్తించి, అక్కడి పరిస్థితులపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు.

స్థానిక యుద్ధానికి సిద్ధం కండి... కార్యకర్త జోలికి ఎవరైనా వస్తే...

ప్రతి అక్రమాన్ని రికార్డు చేయాలి

ఎన్నికల సమయంలో అధికారులు, పోలీసులు లేదా ఇతరులు చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తే వాటిని ఆధారాలతో నమోదు చేయాలని సజ్జల చెప్పారు. ప్రతి ఫిర్యాదు, ప్రతి ఘటన, ప్రతి అధికారిపై వచ్చిన ఆరోపణను డిజిటల్‌గా రికార్డు చేసి, అవసరమైతే లీగల్ చర్యలకు ఉపయోగించాలన్నారు. ఫీల్డ్ స్థాయి నుంచి వచ్చే సమాచారాన్ని మీడియా, సోషల్ మీడియా, లీగల్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా ప్రజల ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.

పార్టీ కార్యకర్తలకు లీగల్ సెల్ అండగా నిలిచింది: పొన్నవోలు

వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి పొన్నవోలు సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ, గత రెండున్నరేళ్లుగా పార్టీ కార్యకర్తలు ఎదుర్కొన్న కేసులు, అరెస్టులు, వేధింపుల సమయంలో లీగల్ సెల్ వారికి భరోసాగా నిలిచిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో పోలీసులు అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారన్న ఆయన, పార్టీ కార్యకర్తలపై కేసులు పెట్టిన సందర్భాల్లో లీగల్ సెల్ వీధుల్లోనూ, కోర్టుల్లోనూ పోరాడిందన్నారు. పార్టీ కోసం కష్టకాలంలో పనిచేస్తున్న ప్రతి న్యాయవాదిని భవిష్యత్తులో పార్టీ గుర్తిస్తుందని, వారికి తగిన గౌరవం లభించేలా చూడాలని కోరారు.

అభ్యర్థులకు న్యాయవాదులు వెన్నుముకగా నిలవాలి: చెవిరెడ్డి

వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి లీగల్ సెల్ కీలక పాత్ర పోషించాల్సి ఉందన్నారు. కొత్తగా పోటీ చేసే అభ్యర్థులకు ఎన్నికల నిబంధనలు, నామినేషన్ ప్రక్రియపై పూర్తి అవగాహన ఉండకపోవచ్చని, అందువల్ల న్యాయవాదులు వారికి ప్రతి దశలో మార్గనిర్దేశం చేయాలని సూచించారు. నామినేషన్ పత్రాలు నింపడం నుంచి దాఖలు చేయడం వరకు, కుల ధ్రువీకరణ పత్రాలు, నో డ్యూస్ సర్టిఫికెట్లు, ఇతర అవసరమైన పత్రాలు పొందడం వరకు లీగల్ సెల్ పూర్తి బాధ్యత తీసుకోవాలని అన్నారు. ఏ అభ్యర్థి నామినేషన్ కూడా సాంకేతిక కారణాలతో తిరస్కరణకు గురికాకుండా ముందుగానే జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. నామినేషన్‌కు సమర్పించిన పత్రాలన్నింటినీ స్కాన్ చేసి సంబంధిత రిటర్నింగ్ అధికారులకు డిజిటల్ రూపంలో కూడా పంపితే, తర్వాత పత్రాలు లేవని చెప్పి తిరస్కరించే పరిస్థితుల్లో ఆధారంగా ఉపయోగపడుతుందని సూచించారు. నామినేషన్ తిరస్కరణ జరిగితే వెంటనే న్యాయపరంగా స్పందించి అవసరమైతే కోర్టును ఆశ్రయించాలని చెప్పారు. ప్రతి నియోజకవర్గంలో న్యాయ సలహా కేంద్రాలు ఏర్పాటు చేసి, ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలను ఎప్పటికప్పుడు ప్రజల దృష్టికి తీసుకెళ్లాలని అన్నారు. పార్టీ అభ్యర్థులకు కేసులు, అరెస్టులతో భయపెట్టే ప్రయత్నాలు జరిగినా వారికి ధైర్యం చెప్పి, చట్టపరమైన రక్షణ కల్పించాల్సిన బాధ్యత లీగల్ సెల్‌పై ఉందన్నారు.

సురక్షిత రోడ్ల కోసం... ఢిల్లీ నేతలతో పయ్యావుల..!!

అనంతపురం, అక్టోబర్ 10 : సీమ వార్త సాయంత్రం.

అనంతపురం జిల్లాలోని ఉరవకొండ నియోజకవర్గం మీదుగా వెళుతున్న ఎన్.హెచ్-42 రహదారిని నాలుగు లైన్ల రహదారిగా విస్తరించాలని రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రివర్యులు శ్రీ పయ్యావుల కేశవ్ కోరారు. ఈ విషయమై శనివారం ఢిల్లీలో కేంద్ర రోడ్డు, రవాణా మరియు రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కలిసి రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రివర్యులు పయ్యావుల కేశవ్ కలిసి ఎన్.హెచ్-42 రహదారిని నాలుగు లైన్ల రహదారిగా విస్తరించాలని ప్రత్యేకంగా లేఖను అందించగా, రహదారి విస్తరణకు కేంద్ర మంత్రి సూత్రప్రాయంగా అంగీకారం తెలిపారు.అనంతపురం - బళ్ళారి రోడ్డులో ఆయా గ్రామ సరిహద్దులయందు తీవ్ర మలుపులు ఉండడం వల్ల ఎక్కువగా ప్రమాదాలు సంభవిస్తుండడంతో మంత్రిగారు ప్రత్యేక చొరవ తీసుకుని మంజూరు చేయించేందుకు చర్యలు తీసుకున్నారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్.హెచ్-42 (ఆంధ్రప్రదేశ్ / కర్ణాటక సరిహద్దు నుండి అనంతపురము సెక్షన్, కి.మీ 4/350 నుండి 75/600 వరకు) రహదారిని నాలుగు లేన్ల రహదారిగా ఉన్నతీకరించాలని మంత్రి పయ్యావుల కేశవ్ కోరారు. ప్రస్తుతం, ఈ 71.25 కి.మీ పొడవున్న రహదారి అనేక మెరుగుపరచని అడ్డ మరియు నిలువు వంపులతో రెండు లేన్ల రహదారిగా ఉందన్నారు. ఇది ఎక్కువ జనాభా గల అనేక పరిపాలనా కేంద్రాలు మరియు నివాస ప్రాంతాల గుండా వెళు తుందన్నారు. అనంతపురం జిల్లా కేంద్రం, ఉరవకొండ నియోజకవర్గ కేంద్రం, ఉరవకొండ, కూడేరు, విడపనకల్లు మండలాలు మరియు 15 గ్రామాల మీదుగా ఎన్.హెచ్-42 రహదారి వెళుతుందని తెలిపారు.2010లో ఈ మార్గాన్ని రాష్ట్ర రహదారి నుండి జాతీయ రహదారిగా (ఎన్.హెచ్-42) మార్చారన్నారు. ఇది ఎన్.హెచ్-67 పై జోలదరసి (కర్ణాటక) వద్ద ప్రారంభమై, ఊరవకొండ, అనంతపురము, రాప్తాడు, కదిరి, పలమనేరు మరియు కుప్పం గుండా ప్రయాణించి, ఎన్.హెచ్-48 పై కృష్ణగిరి (తమిళనాడు) వద్ద ముగుస్తుందన్నారు. 2015-16లో ఈ మార్గాన్ని పేవ్డ్ షోల్డర్లతో రెండు లేన్లకు విస్తరించారని, అయితే, భౌగోళిక ఆకృతిలో పెద్దగా మెరుగుదలలు లేదా బైపాస్‌ల నిర్మాణం వంటివి చేపట్టలేదన్నారు.ఈ రహదారి అనేక నివాస ప్రాంతాల గుండా నేరుగా వెళుతూ, పదునైన మలుపులను కలిగి ఉండటం వల్ల, ఇది తీవ్రమైన భద్రతా ప్రమాదంగా మారి, ట్రాఫిక్ ప్రమాదాల సంఖ్య పెరగడానికి దారితీసిందన్నారు. ముఖ్యంగా, ఈ నిర్దిష్ట మార్గంలో మొత్తం 10 ప్రమాదకర ప్రాంతాలను అధికారికంగా గుర్తించారని, ఈ రహదారిని తక్షణమే నాలుగు లైన్ల రహదారిగా మార్చాలని మంత్రి పయ్యావుల కేశవ్ కేంద్ర మంత్రిని కోరారు. ఎన్.హెచ్-42 రహదారిని నాలుగు లైన్ల రహదారిగా మార్చేందుకు కేంద్రమంత్రి వెంటనే సూత్రపాయంగా అంగీకారం తెలపడం జరిగింది. దీంతో ఈ ప్రాంత రూపురేఖలు మారనున్నాయి.

1000 ఏళ్ల నాటి వీరగల్లు శాసనం వెలుగు.

గోరంట్ల మండలం బాచన్న పల్లిలో అరుదైన ప్రాచీన వీరగల్లు

కన్నడ లిపిలో శాసనాన్ని.....గుర్తించిన చరిత్రకారుడు మైనాస్వామి..



గోరంట్ల అక్టోబర్ 10: అక్టోబర్ 10 సీమ వార్త సాయంత్రం. శ్రీ సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం వానవోలు గ్రామ పంచాయతీ పరిధిలోని బాచన్నపల్లి గ్రామంలో సుమారు 1000 సంవత్సరాల నాటి (సా.శ. 10వ శతాబ్దం) అత్యంత అరుదైన ప్రాచీన వీరగల్లు శిలాశాసనం వెలుగుచూసినట్లు చరిత్రకారుడు మైనాస్వామి శనివారం నాడు విలేఖరులకు తెలిపారు. గ్రామస్థుల ఆహ్వానంమేరకు బాచన్నపల్లిలో చేపట్టిన క్షేత్రస్థాయి పరిశోధనల్లో భాగంగా.. వీరగల్లు శిలాఫలకాన్ని గుర్తించి,అందులోని ప్రాచీన లిపి, శిల్ప విశేషాలను పరిశీలించారు. గ్రామానికి తూర్పున శిథిల శివాలయం పక్కనే అత్యంత ప్రాచీన వీరగల్లును గుర్తించినట్లు,ఆ స్మారక శిలలోని వీరుని శిల్పరూపురేఖలను బట్టి నోలంబపల్లవుల కాలానికిచెందిన వీరుడని ఆయన వివరించారు.నోలంబ పల్లవుల రాజధాని-హెంజేరు(నేటి హేమావతి),పరిసరల్లో మినహా ఈ ప్రాంతంలో నోలంబ వీరగల్లులు కనిపించడం అరుదైన విషయమని మైనాస్వామి పేర్కొన్నారు.బాచన్నపల్లికి కనీసం 1400 సంవత్సరాల చరిత్ర వుండి వుంటుందని,విశ్వవిద్యాలయాలకే పరిమితమైన చరిత్ర పరిశోధకులు, అధ్యయనకారులు మరియు భారత సర్వేక్షణ నిపుణులు బాచన్నపల్లి వంటి గ్రామాలను సందర్శించాలని చరిత్రకారుడు విజ్ఞప్తిచేశారు. ధనుర్ధారి వీరుడు: వీరగల్లు గురించి మైనాస్వామి వివరణ ఈ విధంగా వుంది. "వీరశిల మధ్యభాగంలో విల్లంబులు ధరించిన పరాక్రమవంతుడైన ధనుర్ధారి శిల్పం చెక్కబడి ఉంది. వీరుడు ఎడమచేతితో ఎత్తైన ధనుస్సును పట్టుకొని, కుడిచేతితో బాణం సంధిస్తూ శత్రువులపైకి దూసుకెళ్తున్న యుద్ధ భంగిమలో కనిపిస్తున్నాడు. తలపై ఎత్తైన కొప్పు, నడుముకు చుట్టిన కచ్చ, బాకు నాటి యోధుల సమర వేషధారణను ప్రతిబింబిస్తున్నాయి. నోలంబవాడి సరిహద్దుల్లో గ్రామంపై శత్రుసేనలు లేదా దోపిడీ ముఠాలు దాడి చేసినప్పుడు, గ్రామాన్ని కాపాడడానికి పోరాడి వీరుడు వీరమరణం పొందాడని తెలుస్తోంది.శిలాఫలకం పైభాగపు అర్ధచంద్రాకార శిఖరంలో నాలుగు పంక్తులు, శిల్పం పాదాల కింద నాలుగు పంక్తులు - మొత్తం ఎనిమిది వరుసలలో ప్రాచీన తెలుగు-కన్నడలిపిలో శాసనశీ చెక్కబడిశీది.మొదటి వరుసలో గుండ్రటి వంపులతో కూడిన మంగళప్రదమైన 'స్వస్తి శ్రీ' తో శాసనం ఆరంభమై,నాటి పాలకుల వివరాలను తెలియజేస్తోంది. సదరు వీరుని త్యాగానికి గుర్తింపుగా ఆయన కుటుంబానికి పాలకులు పన్ను మినహాయింపుతో భూమిని మాన్యంగా బహూకరించివుండవచ్చు.ఆ భూదానాన్ని 'రక్తకొడగ'(రక్తమాన్యం) అంటారని చరిత్రకారుడు విశ్లేషించారు. రాయలసీమ సరిహద్దు ప్రాంతాలలో శిల్పంతో పాటు ఇంతటి సమగ్రమైన, ప్రాచీన లిపితో కూడిన సుదీర్ఘ వీరగల్లు శాసనాలు లభించడం అత్యంత అరుదని మైనాస్వామి పేర్కొన్నారు.బహిరంగ ప్రదేశంలో వున్న ఈ అమూల్యమైన చారిత్రక సంపదను సంరక్షించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా వుందని ఆయన స్పష్టం చేశారు.గ్రామస్థులు క్రిష్ణమూర్తి,సంతోష్,శంకరప్ప,నరసింహమూర్తి, నాగభుషణ,నగేష్,హరి తదితరులు చారిత్రక అన్వేషణలో పాల్గొన్నారు.

తిరుమల శ్రీవారికి జైపూర్ దంపతుల ఖరీదైన కానుక..

తిరుమల శ్రీవారికి నేడు భారీగా విరాళాలు, కానుకలు అందాయి. భక్తులు స్వామివారికి విలువైన ఆభరణాలతో పాటు టీటీడీ నిర్వహిస్తున్న ట్రస్ట్‌కు నగదు రూపంలో విరాళాలు సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. రాజస్థాన్‌లోని జైపూర్‌కు చెందిన ఆర్తి బిందాల్ దంపతులు శ్రీవారికి రూ. 51.55 లక్షలు విలువైన బంగారు ఆభరణాలను విరాళంగా అందించారు. ఇందులో వజ్రాలు, రత్నాలు పొదిగిన 147 గ్రాముల బంగారు లాకెట్, వజ్రాలు, కెంపులు పొదిగిన 27 గ్రాముల మూడు వరుసల ముత్యాల హారం ఉన్నాయి. ఈ ఆభరణాలను ఆలయంలోని రంగనాయకుల మండపంలో టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడుకు దాతలు స్వయంగా అందజేశారు. ఉత్సవమూర్తుల అలంకరణకు వీటిని వినియోగించనున్నట్లు అధికారులు తెలిపారు. అలాగే తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహిస్తున్న 'బర్డ్' ట్రస్ట్‌కు కూడా భారీ విరాళం అందింది. అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన దాత హర్షవర్ధన్ రెడ్డి రూ. 10 లక్షలు విరాళంగా ఇచ్చారు. హర్షవర్ధన్ రెడ్డి తరపున టీటీడీ పాలకమండలి సభ్యుడు నన్నపనేని సదాశివరావు ఈ డీడీని ఛైర్మన్ బీఆర్ నాయుడికి అందజేశారు. టీటీడీ సేవా కార్యక్రమాలకు అండగా నిలుస్తున్న దాత హర్షవర్ధన్ రెడ్డికి ఛైర్మన్ బీఆర్ నాయుడు కృతజ్ఞతలు తెలిపారు.

సీమ వార్త సాయంకాలం
శనివారం 10
అక్టోబర్ 2026

బోయ వాల్మీకి సమితి అధ్యక్షుడు మకాశి వెంకటేశులుకు ఘన సన్మానం

...డి.హీరేహాల్ మండల యువకుల ఆధ్వర్యంలో అభినందనలు



డి.హీరేహాల్, అక్టోబర్ 10 (సీమవార్త సాయంకాలం): బోయ వాల్మీకి సమితి రాయదుర్గం నియోజకవర్గ అధ్యక్షుడిగా ఎన్నికైన మకాశి వెంకటేశులును డి.హీరేహాల్ మండల కేంద్రానికి చెందిన యువకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా యువకులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేసి, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. నియోజకవర్గ స్థాయిలో బోయ వాల్మీకి సమాజ అభ్యున్నతికి, యువత సంక్షేమానికి కృషి చేయాలని వారు కోరారు. తనపై నమ్మకంతో అభినందనలు తెలిపిన యువకులకు మకాశి వెంకటేశులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం. బసవరాజు, ఉమేష్, గోపాల, దేవరాజ్, చంద్ర, నాగరాజు, శరణ, అంజి తదితర యువకులు పాల్గొన్నారు.

పారదర్శకంగా భూముల మ్యూటేషన్ ప్రక్రియ పూర్తి

....-- పట్టాదారులకు 1-బి కాపీల పంపిణీ



గోరంట్ల: అక్టోబర్ 10 సీమ వార్త సాయంత్రం. గత సెప్టెంబర్ నెలలో భూముల మ్యూటేషన్ కోసం దరఖాస్తు చేసుకున్న పట్టాదారుల అర్జీలపై విచారణ నిర్వహించి, మ్యూటేషన్ ప్రక్రియను పూర్తి చేయడం జరిగిందని డిప్యూటీ తహసీల్దార్ ఉదయ్ కుమార్ తెలిపారు.అనంతరం సంబంధిత పట్టాదారులకు సమాచారం అందించి, గోరంట్ల తహసీల్దార్ కార్యాలయంలో వారికి 1-బి కాపీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

ఘనంగా మహాలయ అమావాస్య కార్యక్రమం



మడకశిర అక్టోబర్ 10 సీమ వార్త సాయంకాలం నియోజకవర్గ వ్యాప్తంగా శనివారం మహాలయ అమావాస్య పెద్దల పండుగను ఘనంగా జరుపుకున్నారు. విజయదశమి ముందుగా ఈ కార్యక్రమాన్ని గ్రామాలలో జరుపుకోవడం ఆనవాయితీ. ఈ ఆనవాయితీ ప్రకారం గ్రామాలలో తమ పెద్దలకు కొత్త వస్త్రాలు సమాధిపై ఉంచి బంధువులకు అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరుగుతుంది. ముఖ్యంగా కొంతమంది పెద్దల పండుగను ఘనంగా జరుపుకోవడం జరుగుతుంది. నియోజకవర్గ పరిధిలోని రొల్ల మండలం కాలువేపల్లి గ్రామంలో దివ్య జ్యోతి, భవ్య, కావ్య కుటుంబ సభ్యులు ఘనంగా సమాధికి పుష్పాలు వేసి కార్యక్రమాలను జరుపుకోవడం జరిగింది. ఈ సందర్భంగా చిన్నారులు హయానాష్, మీహాన్ తదితరులు ఉన్నారు.

దాసరపల్లిలో ప్రతి ఇంటికి కుళాయి ద్వారా తాగునీరు



మడకశిర. అక్టోబర్ 10 చీమ వార్త నియోజకవర్గ పరిధిలోని గుడిబండ మండలం కరికేర పంచాయతీ పరిధిలోని దాసరపల్లి గ్రామంలో ప్రతి ఇంటికి కుళాయిల ద్వారా మంచినీటి సరఫరా కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి అధ్యక్షతన ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా టీడీపీ సీనియర్ నాయకుడు నాగభూషణ్ మాట్లాడుతూ,గతంలో నీటి కోసం గ్రామస్తులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. ప్రస్తుతం ప్రతి ఇంటికి కుళాయిలు ఏర్పాటు చేస్తుండటంతో ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటున్న కూటమి ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాండురంగప్ప,శివన్న, రాజు,నారాయణప్ప, కార్యకర్తలు,గ్రామస్థులు పాల్గొన్నారు.

నల్లూరు గ్రామంలో ముందస్తుగా డోర్ టు డోర్ హెల్త్ సర్వే

లార్వాలు, డ్రైనేజీలు, నీటి తొట్టెలను పరిశీలించిన వైద్య సిబ్బంది



రొద్దం, అక్టోబర్ 10 (సీమవార్త సాయంకాలం): మండలంలో ఎల్ నినో ప్రభావం తీవ్రంగా ఉండటంతో ఎండలు మండిపోతున్నాయి. ఉదయం తొమ్మిది గంటలు దాటితే బయటకు రావాలంటేనే చాలామంది భయపడుతున్నారు. వేసవి కంటే ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో పెద్దమంతూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని నల్లూరు గ్రామంలో శనివారం వైద్య సిబ్బంది డోర్ టు డోర్ సర్వే చేపట్టారు. ముందస్తుగా జ్వరాలు, జలుబు, టైఫాయిడ్, మలేరియా వంటి వ్యాధులను గుర్తించేందుకు పరిశీలిస్తున్నారు. మొదటిసారిగా నల్లూరు గ్రామంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నామని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమ్య తెలిపారు. ఇదే తరహాలో ఈ సెంటర్ పరిధిలోని గ్రామాల్లోనూ పరిశీలించి ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని డాక్టర్ రమ్య, ఎంపీహెచ్ఈఓ సుదర్శన్ బాబు తెలిపారు. అనుమానిత కేసులు బయటపడితే హిందూపురం, పెనుకొండ ఆసుపత్రులకు రిఫర్ చేసి సరైన చికిత్స అందేలా చూస్తామని వారు తెలిపారు. నల్లూరు గ్రామంలో అక్కడక్కడా జలుబు, వైరల్ జ్వరాలు ఉండటంతో బాధితులకు మందులు పంపిణీ చేశామని తెలిపారు. అదేవిధంగా విషజ్వరాలు రాకుండా గ్రామస్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

నవీన్ నిశ్చల్ ను కలిసిన...కొండబోయిన సతీష్.




ఓబులదేవరచెరువు (అక్టోబర్11)సీమవార్త జనసేన పార్టీ వ్యవస్థాపకులు,అధినేత పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో హిందూపురం కు చెందిన సీనియర్ రాజకీయ నాయకులు నవీన్ నిశ్చల్ ఇటీవల జనసేనలోకి చేరిన విషయం తెలిసిందే. నవీన్ నిశ్చల్ జనసేన పార్టీలోకి రావడానికి ఆహ్వానిస్తూ... ఓడి చెరువు మండలానికి చెందిన జనసేన పార్టీ నాయకులు కొండబోయిన సతీష్ తన మిత్రబృందంతో కలిసి శనివారం హిందూపురంలో నవీన్ నిశ్చల్ స్వగృహంలో ఆయనను కలిసి పుష్ప గుచ్చాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా కొండబోయిన సతీష్ మాట్లాడుతూ... సీనియర్ రాజకీయ నాయకులు నవీన్ నిశ్చల్ జనసేన లోకి రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.పుట్టపర్తి జిల్లాలో సీనియర్ రాజకీయ నాయకులు జనసేన పార్టీలో ఉంటే తమకు కూడా ఎంతో ఉపయోగకరం అవుతుందన్నారు. సత్యసాయి జిల్లాలో సీనియర్ నాయకులు ఉంటే వారి సలహాలు,సూచనలతో భవిష్యత్తులో జనసేన పార్టీ మరింత బలోపేతం అవుతుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో సతీష్ తో పాటు నాయకులు శంకర్ పలువురు జనసేన పార్టీ ఇతర నాయకులు, యువకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

వేములపాటిని కలిసిన..

మార్కెట్ యార్డ్ చైర్మన్ పూల శివ.

....పుట్టపర్తి టిడ్కో ఇళ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని విజ్ఞప్తి



పుట్టపర్తి డెస్క్ అక్టోబర్ 10 సీమ వార్త సాయంత్రం. ఆంధ్రప్రదేశ్ టీడ్కో చైర్మన్ వేములపాటి అజయ్ కుమార్‌ను పుట్టపర్తి మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీ పూల శివప్రసాద్ అనంతపురంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలో 2017లో ప్రారంభమై, గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన టి డ్కో ఇళ్ల నిర్మాణ పనుల పునఃప్రారంభానికి నిధులు విడుదల చేసినందుకు ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.నిరుపేద, మధ్యతరగతి కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేసే దిశగా ఇళ్ల నిర్మాణం ఎంతో కీలకమని పేర్కొన్నారు. పుట్టపర్తి ప్రాంత ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని,చైర్మన్ స్వయంగా పుట్టపర్తికి విచ్చేసి నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేసి, లబ్ధిదారులకు ఇళ్లను అందుబాటులోకి తీసుకువచ్చేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న లబ్ధిదారులకు త్వరలోనే సొంతింటి కల నెరవేరేలా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని శ్రీ పూల శివప్రసాద్ ఆకాంక్షించారు.

కదిరి 23వ వార్డులో వైసీపీని వీడి టీడీపీలో చేరిన 30 ముస్లిం మైనార్టీ కుటుంబాలు

అన్ని వర్గాల ప్రజలకు టీడీపీ అండగా ఉంటుంది

ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్



కదిరి, అక్టోబర్ 10: సీమ వార్త సాయంత్రం న్యూస్.. కదిరి పట్టణంలో తెలుగుదేశం పార్టీతో కలిసి పనిచేసేందుకు అన్ని వర్గాల ప్రజలు ముందుకు వస్తున్నారని, ప్రజల సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు గౌరవ శ్రీ కందికుంట వెంకటప్రసాద్ అన్నారు. కదిరి పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో 23వ వార్డుకు చెందిన 30 ముస్లిం మైనార్టీ కుటుంబాలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని వీడి, ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరాయి. కటిక షేక్ హస్సూ ఆధ్వర్యంలో ఆయన కుమారుడు సోహైల్‌తో పాటు మిచ్చెర్ సాదిక్, బాబ్జాన్, షేక్ మహమ్మద్ అలీ, మహాభాష, షేక్ బాబ్జాన్, రిక్షా సాదిక్ అలీ, అబిద్, వసీం, సాబు తదితరులు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై తెలుగుదేశం పార్టీలో చేరినట్లు తెలిపారు. ముస్లిం మైనార్టీల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను స్వాగతిస్తూ, పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మాట్లాడుతూ: “తెలుగుదేశం పార్టీలోకి వచ్చే ప్రతి ఒక్కరినీ సాదరంగా ఆహ్వానిస్తున్నాం. ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత గౌరవం, గుర్తింపు కల్పిస్తాం. పాత, కొత్త నాయకులు, కార్యకర్తలు అనే తేడా లేకుండా అందరూ కలిసికట్టుగా పనిచేయాలి. కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరికీ పార్టీలో తగిన ప్రాధాన్యత ఉంటుంది. కదిరి నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సంక్షేమమే మా ప్రధాన లక్ష్యం” అని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీసీ కాలనీ వాసులకు....

30 రోజులుగా టాంకర్లతో నీటి సరఫరా.

మంత్రి సవితమ్మ ప్రత్యేక చొరవతో నిరంతరం నీళ్లు.



గోరంట్ల అక్టోబర్ 10 సీమ వార్త సాయంత్రం. గోరంట్ల మండలంలోని రెడ్డి చెరువు పల్లి బీసీ కాలనీలో నెలకొన్న తీవ్ర తాగునీటి సమస్యపై స్థానిక పార్టీ నాయకులు మంత్రి సవితమ్మ దృష్టికి తీసుకు వెళ్లడంతో స్పందించిన మంత్రి గత 30 రోజులుగా బీసీ కాలనీ జనానికి ట్యాంకర్ల ద్వారా నిరంతరం నీళ్లు అందిస్తున్నారు. నీటి సరఫరా పై స్థానిక బీసీ కాలనీవాసులు స్పందిస్తూ నీటి సమస్యను మంత్రి దృష్టికి తీసుకు వెళ్లడంతో వెంటనే మంత్రి స్పందించి నిరంతరం మాకు నీళ్లు ఇవ్వడం ఆనందంగా ఉందని మంత్రికి రుణపడి ఉంటామని, స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు సైతం నీటి సమస్య తీర్చడంలో కీలకపాత్ర పోషించారని కాలనీవాసులు ఆనందం వ్యక్తం చేశారు.

అన్న క్యాంటీన్లో అన్నం వడ్డించిన...

సవితమ్మ యువ టీం.

అన్నం తిన్న.... జనం కళ్ళల్లో ఆనందం కనిపిస్తోంది.



గోరంట్ల అక్టోబర్ 10 సీమ వార్త సాయంత్రం. మంత్రి సవితమ్మ సొంత నిధులతో గోరంట్ల పట్టణంలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్లో 5వ రోజు సవితమ్మ యువ సైన్యం పేదలకు అన్నం వడ్డించి సంతృప్తి పొందారు. ఈ సందర్భంగా సవితమ్మ యువ సైన్యం మాట్లాడుతూ నాడు ఎన్టీఆర్ 2 రూపాయలకే కిలో బియ్యం ఇచ్చి పేదలను ఆదుకుంటే నేడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి సవితమ్మ సొంత నిధులతో 5 రూపాయలకే కడుపునిండా భోజనం పెట్టి అన్న నందమూరి తారక రామారావు జ్ఞాపకాలను గుర్తు చేస్తుందని ఆయన అడుగుజాడల్లో నడుస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో యువ సైన్యం సభ్యులు రోహిత్, సుభహన్, బూదిలి లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

Printed, Pulished, Owned by BEEREA ESWARAYYA & Printed at M/S ESWAR Offset Printers D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P.
RNI No: APTEL /25/A2860 & Published at D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P. Editor B. ESWARAYYA Cell :9490860881